క్లుప్తంగా

గిరిజన గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని 2 బాలురు, 2 బాలికల గిరిజన గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 3వ తరగతికి, 4 నుంచి 9వ తరగతులకు బ్యాక్‌లాగ్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 30 లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చిత్తూరు సంజయ్‌గాంధీ నగర్, పుంగనూరులోని బాలికల పాఠశాలలు, బంగారుపాళ్యం, రామకుప్పంలోని బాలుర గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్ల వద్ద లభిస్తాయన్నారు. పూర్తి చేసిన వాటిని వారి వద్దే అందజేయాలని తెలిపారు. లాటరీ విధానంలో సీట్లు కేటాయిస్తామన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మెప్మా సభ్యులు

చిత్తూరు రూరల్ : మెప్మా (మైనారిటీ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్స్ మర్చంట్ అసోసియేషన్) సభ్యులు శనివారం రుక్సానా అనే చిన్నారి గుండె చికిత్సకు ఆర్థిక సాయం అందించారు. చిత్తూరు నగరంలోని జైహింద్ పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆ చిన్నారి కుటుంబ సభ్యులకు రూ.30 వేలు అందజేశారు. కార్యక్రమంలో మెప్మా చైర్మన్ ఎహసానుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు ఆల్తాఫ్, సభ్యులు మునీర్, రసూల్‌సాహెబ్, ముక్తార్, రఫీ, గౌస్, గిడ్డుబాయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ జెడ్పీటీసీకి గాయాలు

బంగారుపాళెం: మండలంలోని గుండ్లకట్టమంచి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు గాయపడ్డారు. గ్రామానికి చెందిన మహేంద్రన్ భార్య, మాజీ జెడ్పీటీసీ కళావతి, ఆమె కుమారుడు ధర్మేంద్ర పొలం వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కళావతి, కుమారుడు ధర్మేంద్ర గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మామిడి తూకాల్లో అక్రమాలను సహించం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి

పలమనేరు: జిల్లాలోని మామిడి ర్యాంపుల వద్ద తూకాల్లో అక్రమాలకు పాల్పడే వ్యాపారులపై చర్యలు తప్పవని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. మామిడి కాయల వృద్ధి, కోతదశలో చేపట్టాల్సిన పద్ధతులపై శనివారం ఆర్డీవో కార్యాలయంలో పలమనేరు, కుప్పం నియోజకవర్గాల పరిధిలోని ఆర్బీకే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 33 చోట్ల మామిడి ర్యాంపులున్నాయన్నారు. అక్కడి వ్యాపారులు రైతులకు తూకాల్లో మోసం చేయకుండా లీగల్ మెట్రాలజీ శాఖ నుంచి శిక్షణ పొందిన ఆర్బీకే సిబ్బంది పర్యవేక్షణలో మామిడి అమ్మకాలు సాగించాలని తెలిపారు. గిట్టుబాటు ధర రావాలంటే మామిడి రైతులు ఒకేసారి కాకుండా దఫ, దఫాలుగా మార్కెట్ ధరలను అనుసరించి కాయలను దిగుబడి చేసి అమ్మకాలు చేయాలని సూచించారు. స్థానిక హార్టికల్చర్ ఏడీ డాక్టర్ కోటేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, హెచ్‌వోలు లక్ష్మీ ప్రసూన, డింపుల్‌ప్రియ, ఎనిమిది మండలాల హార్టికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చెరువులో చిక్కిన 15 కేజీల చేప



బైరెడ్డిపల్లె : మండలంలోని మూలతిమ్మేపల్లె సమీపంలోని కోమిటివాని చెరువులో శనివారం 15 కేజీల చేప జాలర్లకు చిక్కింది. మండలంలోని చెరువుల్లో సాధారణంగా 2 నుంచి 5 కేజీల వరకు చేపలు ఉన్నాయి. కోమిటివాని చెరువులో 15 కేజీల చేప జాలర్లకు దొరకడంతో ప్రజలు ఆసక్తిగా చూశారు. మండల పరిధిలోని చెరువుల్లో ఇప్పటి వరకు ఇంత పెద్ద చేప లభ్యం కాలేదని ప్రజలు తెలిపారు.

చిత్తూరు నడివీధి గంగ జాతరలో అంబలి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు, అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు, నడివీధిలో కొలువైన గంగమ్మ (ఫైల్)







అందరి అమ్మ.. గంగమ్మ!

గంగజాతర.. చిత్తూరువాసులకు రెండు రోజులపాటు పెద్ద పండుగ. అందరూ కలిసికట్టుగా ఈ జాతరను ఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ పండగంటే 15 రోజులకు ముందు నుంచే చిత్తూరులో సందడి ఉంటుంది. ప్రతి ఏటా ఆనవాయితీ ప్రకారం, సంప్రదాయబద్ధంగా ఈ జాతరను నిర్వహిస్తున్నారు. ఈ జాతరలో అమ్మవారికి అన్ని వర్గాలవారి నివేదన ప్రత్యేకంగా ఉంటుంది. నివేదన తర్వాతే జాతర తెర ప్రారంభమవుతుంది. మంగళ, బుధవారాల్లో నిర్వహించే ఈ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- అమ్మవారికి అన్ని వర్గాల నివేదన
- కలసికట్టుగా నిర్వహించే పండుగ
- రెండు రోజుల గంగజాతర

చిత్తూరు రూరల్: చిత్తూరు ప్రజల ఆరాధ్యదైవం, ఇలవేల్పు అయిన నడివీధి గంగమ్మ జాతరను అన్ని సామాజిక వర్గాలు కలిసికట్టుగా నిర్వహిస్తాయి. చాటింపు వేసి కంకణం కట్టిన వంశపారంపర్య జాతర నిర్వాహకులు పురాణ ఆచారాలు, ఆనవాయితీని తప్పకుండా పాటిస్తూ వస్తున్నారు. జాతరకు ముందే రజకులు గ్రామదేవత ఎల్లమ్మ, పొలిమేర దేవత పొన్నియమ్మకు అమృత తలిగను నైవేద్యంగా సమర్పిస్తారు. ఇక గెరిగ ఊరేగింపు, చాటింపు ప్రక్రియను అప్పట్లో మత్స్యకార కుటుంబీకులకు అప్పగించారు. ఆ వంశస్తులే ఇప్పటికీ ఈ ప్రక్రియను ఏటా నడిపిస్తూ వస్తున్నారు. కుమ్మరివాళ్లు మట్టి పాత్రలతో అంబలి తీసుకొచ్చి వడిబాలు పేరుతో నైవేద్యం సమర్పిస్తారు. కర్ణంవాళ్లు అమ్మవారి శిరస్సు, తాళిబొట్టును తమ ఇంట్లో ఉంచుకుని జాతర రోజున తీసుకొస్తారు. దర్జీ కుటుంబీకులు తెలుపు రంగు దుస్తులు సమర్పిస్తారు.మాజీ ఎమ్మెల్యే సీకేబాబు కుటుంబీకులు తాతముత్తాల కాలం నుంచి గంగమ్మకు తొలిపూజ చేయడం, అమ్మవారిని నిమజ్జనానికి తీసుకెళ్లే సమయంలో గ్రామ దేవత పొన్నిమయ్మకు సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

చిత్తూరుకు పండగ కళ

ఈ నెల 16,17 తేదీల్లో జరిగే గంగ జాతరకు చిత్తూరు నగరం ముస్తాబవుతోంది. నడివీధితో పాటు గిరింపేట, శంకరయ్యగుంట, కొంగారెడ్డిపల్లి, సంతపేట, దొడ్డిపల్లి, మురకంబట్టు, ఓబనపల్లి, ఇరువారం తదితర ప్రాంతాల్లో గంగజాతర అట్టహాసంగా నిర్వహించనున్నారు. ఈ ఏర్పాటు పనులు ఆయా ప్రాంతాల్లో చురుగ్గా సాగుతున్నాయి. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసేలా చూస్తున్నారు. తెర ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు సంప్రదాయబద్ధంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు, జాతర కమిటీ సభ్యులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వాడవాడలా వేడుక

కొంగారెడ్డిపల్లి, సంతపేట, గిరింపేట, మురకంబట్టు, కట్టమంచి, దొడ్డిపల్లి తదితర ప్రాంతాల్లో గంగజాతరను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ వస్తుంటారు. అప్పట్లో పెద్దల నిర్ణయం మేరకు ఆచారాలను అనుసరిస్తూ జాతరను నిర్వహిస్తున్నారు. ఈ జాతరకు ముందు రాత్రి కొన్ని ప్రాంతాల్లో అమ్మవారి శిరస్సు ఊరేగింపుగా ఇంటింటికి వెళ్లి పూజలందుకోవడం మరో ప్రత్యేకత.

కోరిన కోర్కెలు తీర్చే తల్లి

కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా చిత్తూరు గంగమ్మ నగరవాసుల ఆదరణ పొందింది. తమ కోర్కెలు నెరవేరాలని వేడుకుంటే తప్పకుండా అమ్మ అనుగ్రహిస్తుందని, ఆ కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. అలా వారి కోర్కెలు నెరవేరిన తరువాత భక్తులు అమ్మవారికి వివిధ రూపాల్లో మొక్కులు చెల్లించుకుంటారు. చిత్తూరువాసులతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఇక్కడ జరిగే గంగజాతరలో మొక్కులు చెల్లించుకుంటారు. అందులో భాగంగానే జాతరలో అంబలి పోయడంతోపాటు కుంభ నైవేద్యం సమర్పిస్తుంటారు.

పోలీసుల నిఘా

రెండేళ్లపాటు కోవిడ్ మహమ్మారి జాతర సందడి లేకుండా చేసింది. పోయిన ఏడాది జాతర నిర్వహించినప్పటికీ కోవిడ్ నిబంధనలు అమలు చేయాల్సి వచ్చింది. అయితే ప్రస్తుతం కోవిడ్ నామరూపాల్లేకుండా పోయింది. గతేడాది ఉన్న ఆ భయం నుంచి ప్రజలు పూర్తిగా బయటపడ్డారు. ఈ క్రమంలోనే ఈ సారి జాతర నిర్వహణపై భారీ అంచనాలు నెలకొన్నాయి. జాతరను తిలకించేందుకు వచ్చే భక్తుల సంఖ్య అశేషంగా పెరగనుంది. దీంతో పోలీసుశాఖ అప్రమత్తమైంది. జాతర నిర్వాహకులతో మాట్లాడి ఏర్పాట్ల విషయంలో తప్పిదాలు లేకుండా చూడాలని ఆదేశించింది. ప్రజలకు ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. ఈ మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయిలో నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. పోలీసు బలగాలను దింపనుంది. మండపాల వద్ద అడుగడుగునా సీసీ కెమెరాలను బిగించనుంది. ఎక్కడ ఏం జరిగినా పోలీసు బృందం స్పందించేలా ప్రత్యేక టీంను కేటాయించనుంది. మొత్తానికి చిత్తూరు జాతర ప్రశాంతంగా జరగాలని నిఘా వ్యవస్థను పటిష్టం చేస్తోంది.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: స్థానిక ఎన్పీసీ నాయుడు పార్కులో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యుల ఉదయం 9 గంటల నుంచి రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని కంటి జబ్బురోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు కోసం రేపు ధర్నా

యాదమరి: మండలంలోని జోడి చింతల నుంచి సరిహద్దు వరకు రోడ్డును బాగు చేయాలని కోరుతూ సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు సరిహద్దు గ్రామాల ప్రజలు తెలిపారు. అంతర్‌రాష్ట్ర రహదారి గుంతలమయమైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని వాపోయారు. దీనిపై తహసీల్దార్, ఎస్‌ఐలకు అర్జీలు సమర్పించినట్లు వారు చెప్పారు.

పది సీబీఎస్‌ఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల బృందం

చిత్తూరు కలెక్టరేట్ : పదవ తరగతి సీబీఎస్‌ఈ ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చాటారని బృందావన్ పాఠశాల కరస్పాండెంట్ శైలజాకుమారి తెలిపారు. ఈ మేరకు ఆమె విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన చరణ్‌కుమార్ 95.2 శాతం, లిఖిత్ 89 శాతం, తేజశ్రీ 86.2 శాతం, జీవన 85 శాతం, గణేష్ 82 శాతం ఫలితాలు సాధించారన్నారు. నగరంలోని సంతపేట వద్ద ఉన్న ఆ పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీచర్లు పాల్గొన్నారు.

అర్ధగిరిలో హనుమాన్ జయంతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



అర్ధగిరి క్షేత్రంలో కలశ పూజ చేస్తున్న అర్చకులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఉదయం మూలవిరాట్ వీరాంజనేయ స్వామికి అభిషేకం పూజలు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు భక్తిప్రపత్తులతో రక్షాబంధనం నిర్వహించారు. అనంతరం అంకురార్పణ, కలశ స్థాపన నిర్వహించారు. తర్వాత స్వామికి నివేదన, మంగళ హారతి ఇచ్చారు. ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, పంచామృత అభిషేకం, కలశారాధన నిర్వహిస్తారు. అనంతరం స్వామికి విశేష అలంకరణ చేస్తారు. 9 గంటలకు వీరాంజనేయస్వామికి భక్తితో ఇరుముడి చెల్లింపులు చేస్తారని ఈఓ పేర్కొన్నారు. 11 గంటలకు ఆంజనేయ స్వామి సహస్రనామ హోమం, ఉత్సవ విగ్రహ స్నపన తిరుమంజనం, మంత్రపుష్పం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం చేస్తారు. సాయంత్రం 5 గంటలకు తులసి పుష్పాదులచే సహస్రనామ పూజ, రాత్రి 7 గంటలకు ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహిస్తామని వివరించారు. 15వ తేదీ ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, వేదపారాయణం, 9 గంటలకు వసంతోత్సవం, నివేదన, మహామంగళహారతితో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని ఉత్సవాలను తిలకించి పునీతులు కావాలని కోరారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం





తవణంపల్లె: గర్భిణికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది, గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్యాధికారి సందీప్

తవణంపల్లె: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా గ్రామీణులకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చిందని మండల వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పల్లెచెరువులో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ 67 మందికి వైద్య పరీక్షలు చేయించి మందులు ఉచితంగా అందజేశారు. అనంతరం 104 మొబైల్‌వ్యానులో గర్భవతులకు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు. పీహెచ్‌ఎన్ భారతి ఎగువ వెంకటాపురంలో పిల్లలకు టీకాల పంపిణీని పర్యవేక్షించారు. పిల్లలకు క్రమం తప్పకుంగా వ్యాధినిరోధక టీకాలు వేయించాలని సూచించారు. గర్భవతులకు టీకాలు వేయించారు. హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఏఎన్‌ఎం జమున, ఎంఎల్‌హెచ్‌పీ శోభ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ వైద్యం

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలతో అందరికీ వైద్యం అందజేస్తున్నట్లు 104 వైద్యాధికారి సందీప్ తెలిపారు. పాపసముద్రం గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతోపాటు మంచం పట్టిన రోగులు, బీపీ, షుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. వారికి అవసరమైన మందులు, మాత్రలను అక్కడిక్కడే ఇవ్వనున్నట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది రుక్మణమ్మ, కవిత, చంద్ర, బుజ్జమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలోనే చేర్పించండి



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లిల్లెమ్మ అన్నారు. మండలంలోని తుంబకుప్పంలో శనివారం ఉపాధ్యాయుల బృందం పర్యటించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న ఉచిత విద్య, వసతులను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న వసతులను వివరించారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా కలిగే ప్రయోజనాలను గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

గుడిపాలలో కొండెక్కిన కోడి ధర



గుడిపాల: కోడి మాంసం ధరకు రెక్కలు వచ్చాయి. బహిరంగ మార్కెట్‌లో సామాన్యుడు కొనలేని పరిస్థితి ఏర్పడింది. నిన్నటి వరకూ రూ.160 పలికిన చికెన్ అమాంతం రూ.230 నుంచి రూ.250కి చేరింది. దాణాతో పాటు కోళ్ల ఫీడింగ్‌కు అందించే మందులు, రవాణా చార్జీల భారాన్ని వ్యాపారులు కొనుగోలు దారులపై వేస్తున్నారు. ఫామ్‌లలో పెంపకానికి తెచ్చే కోడి పిల్లల ధరలు కూడా పెరగడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పెంపకం దారులంటున్నారు. ఆరు నెలల క్రితం రూ.15కి లభించే పిల్లలు నేడు ఒక్కో కోడిపిల్ల రూ.45కి కొనాల్సి వస్తుందని పెంపకం దారులమాట.

1500కి పైగా కోళ్ల ఫారాలు

జిల్లాలో సుమారు 1500కు పైగా కోళ్ల ఫారాలున్నాయి. సుమారు 3,500కుపైగా చికెన్ సెంటర్లున్నాయి. జిల్లా కేంద్రంలోనే 300కు పైగా విక్రయ కేంద్రాలున్నాయి. రోజువారీ జిల్లా వ్యాప్తంగా 30 టన్నులకు పైగా కోళ్లు అమ్ముడవుతున్నాయి. ఆదివారం, పండుగ రోజుల్లో 30నుంచి 35 టన్నుల కోడి మాంసం అమ్ముడవుతోంది. కిలోలైవ్ కోడి రూ.150కి కొన్న వ్యాపారి రీటైలర్స్‌కి రూ.12 లాభంతో కలిపి రూ.162కి విక్రయిస్తున్నారు. దుకాణదారులు కిలో కోడి మాంసం రూ.230 నుంచి రూ.250కి విక్రయిస్తున్నారు. కిలో చికెన్‌పై 80 నుంచి రూ.90 అదనపు ధరకు అమ్ముతున్నారు. దుకాణాల అద్దెలు, గ్యాస్, క్లీనింగ్, కూలీల ఖర్చు, అద్దె పోను తమకు రూ.20 నుంచి రూ.30 మిగులుతోందని విక్రేతలంటున్నారు.

పెరిగిన ధరలు

సాధారణంగా వేసవిలో చికెన్ ధర తగ్గుతుంది. ఈ సారి ఆ పరిస్థితి కనిపించడం లేదు. రెండు కిలోల బరువు పెరగడానికి కోడిని పెంపకం దారుడు 45రోజుల పాటు సంరక్షించుకోవాలి. వేసవిలో మేత సరిగ్గా తినవు. దీంతో బరుగు పెరగడానికి 60 రోజుల సమయం పడుతుంది. బ్రాయిలర్ కోడి మేతలో ప్రధానమైన సోయాబీన్ ధర నెల రోజుల వ్యవధిలో కిలోకు రూ.30 నుంచి రూ.70కి పెరిగింది. మొక్కజొన్న కిలో రూ.14 నుంచి రూ.23కి పెరిగింది. చికెన్ సెంటర్‌ల నిర్వాహకులు కర్ణాటక నుంచి రవాణా చేసుకుంటున్నారు.

బాబు వంచన.. జగనన్న సంక్షేమం

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు
- పాలకలలో గడప గడపకూ మన ప్రభుత్వం



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: నాడు చంద్రబాబు ఏ హామీ నెరవేర్చకుండా ప్రజలను వంచిస్తే, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలను అందించి అండగా నిలిచారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని పాలకల–2 సచివాలయ పరిధిలో శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మిట్టూరు, మిట్టూరు దళితవాడ, మిట్టూరు బీసీ కాలనీ, ఎర్రేపల్లె, ఎర్రేపల్లె దళితవాడ, ఎర్రేపల్లె ఎస్టీ కాలనీ, మల్లారలపల్లె, అగ్రహారంపల్లె, అగ్రహారంపల్లె దళితవాడ, చిన్నస్వామిరెడ్డిపల్లె, చిన్నస్వామిరెడ్డిపల్లె దళితవాడ, పాలకలలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఇంటి పట్టాలు ఇవ్వాలని, సీసీ రోడ్లు వేయాలని, అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని, భూ సమస్యలు పరిష్కరించాలని, పింఛన్లు మంజూరు చేయాలని తదితర సమస్యలను ఆయా గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలన్నీ సానుకూలంగా విన్న ఎమ్మెల్యే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎమ్మెల్యే 540 కుటుంబాలను కలిసి పలకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సేవలు పొందేందుకు ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదనే సచివాలయాలు ఏర్పాటు చేశారని చెప్పారు. జగనన్న చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్న ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పాలకల–2 సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన గడప గడపకు కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులపై అధికారులతో చర్చించి, దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీటీసీ సాగర్‌రెడ్డి, పార్టీ నేతలు ముదిగోళం సురేంద్రరెడ్డి, గణేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, టెరిన్‌రెడ్డి, శేషాద్రి, సురేష్‌రెడ్డి, ధనచంద్రరెడ్డి, ధనంజయ, దేవా, రాము, ఎంపీడీఓ నిర్మలాదేవి పాల్గొన్నారు

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. శనివారం మండలంలోని వడ్డిపల్లెలో బీటీ రోడ్డు పనులకు ఆయన భూమి పూజ చేశారు. వడ్డిపల్లె నుంచి పుల్లూరు వరకు 2.5 కి.మీ మేర రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీపీ మోహన్, మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

రేపు పూతలపట్టులో..

పూతలపట్టు: మండలంలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని వడ్డేపల్లి పంచాయతీ పరిధిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7గంటలకు మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక హాజరు కావాలని ఆదేశించారు.

నాలుగేళ్ల డిగ్రీ విధానంపై అవగాహన



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ విజయశేఖరం

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు నూతన డిగ్రీ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ విజయశేఖరం మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో ఓ మేజరు సబ్జెక్టు, ఓ మైనర్ సబ్జెక్ట్‌గా డిగ్రీ కోర్సులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుందని తెలిపారు. బీఏ, బీకాం విద్యార్థులు ఇతర సబ్జెక్టులను, సైన్స్ విద్యార్థులు ఇతర అంశాలను తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇకపై డిగ్రీ కోర్సు మూడేళ్లు కాకుండా నాలుగేళ్లగా ఉంటుందన్నారు. నాలుగేళ్లు డిగ్రీ పూర్తి చేసిన వారు నేరుగా పీహెచ్‌డీలో ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన పలు విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.